క్లుప్తంగా

సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

పిట్టలవానిపాలెం: గోకరాజునల్లిబోయినవారి పాలెం గ్రామంలో గురువారం సీతారామ స్వామి సమేత లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు అత్యంత వైభవంగా ప్రారంభమైయ్యాయి. వేద పండితులు హోమాలు, పూజలు నిర్వహించారు. ప్రత్యేక యాగశాలలో పూజలు నిర్వహించారు. శుక్ర, శని వారాల్లో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ దబ్బుకూటి మాధవరావు, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆటో..



కర్లపాలెం: ప్రయాణికులతో రోడ్డుపై వెళ్లాల్సిన ఆటో కాలువలోకి దూసుకెళ్లిన ఘటన గురువారం రాత్రి కర్లపాలెంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎం.శివయ్య వివరాల మేరకు.. కర్లపాలెం సెంటర్ నుంచి తుమ్మలపల్లి గ్రామానికి వెళ్లేందుకు ఐదుగురు ఆటో ఎక్కారు. గేర్‌లో ఉన్న ఆటోను డ్రైవర్ స్టార్ట్ చేయడంతో.. పక్కనే ఉన్న ఇసుక చానల్‌లోకి ఒక్కసారిగా దూసుకెళ్లింది. కాలువలో నీరు తక్కువగా ఉండటంతో ప్రమాదం తప్పింది. ఒకరికి స్వల్ప గాయాలయ్యాయని, స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థికి ట్యాబ్ అందచేత

భట్టిప్రోలు: స్థానిక టీఎంరావు హైస్కూల్ విద్యార్థి వేల్పూరి హేమసాయి గణేష్‌కు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిన ట్యాబ్‌ను గురువారం ప్రధానోపాధ్యాయుడు చందలూరి రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు అందజేశారు. గత పదో తరగతి పరీక్షల్లో గణితంలో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థిని పెరికల చాందినికి విశ్రాంత హెచ్ఎం టీవీ గురునాథరావు జ్ఞాపకార్థం కుమారుడు సారథి రూ. 1,116 నగదును అందించారు. పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఉపాధ్యాయులు కె. కోటేశ్వరమ్మ, సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, మురళీధరరావు, సుబ్బారావు, అనూల్‌హక్, సత్యరత్న పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

చంపాడు(వేమూరు): సేంద్రియ వ్యవసాయ పద్ధతులు వల్ల అధిక దిగుబడులు సాధించడం జరిగిందని బాపట్ల జిల్లా మాస్టర్ ట్రైనర్ కేతోరా థెరీసా పేర్కొన్నారు. చంపాడు గ్రామంలో రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 30 రకాలు విత్తనాలు గుళికలుగా తయారు చేసి పొలంలో చల్లడం వల్ల పంటలు అధిక దిగుబడి సాధించడం జరుగుతుందని చెప్పారు. ఈ మొక్కలు 45 రోజుల తర్వాత కలియదున్నితే భూమి సారవంతం అవుతుందని చెప్పారు. సర్పంచ్ కూచిపూడి రత్నకుమారి, మేరుగ రాధకృష్ణ, పీఆర్‌పీ ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్, అనిత, అరుణ్‌బాబు, చల్ల యుగంధర్, వాకా శాంతకుమారి, శైలజ పాల్గొన్నారు.

బోస్టన్ ప్రొఫెసర్‌తో ఐలవరం విద్యార్థుల భేటీ



ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులతో యూఎస్ఏలోని బోస్టన్ ప్రొఫెసర్ ఇథన్ బాక్స్‌స్టర్ వర్చువల్‌గా గురువారం భేటీ అయ్యారు. భూమి చరిత్ర, పరిశోధనల గురించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ- సైన్స్‌పై అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ప్రొఫెసర్ ఇథన్ బాక్స్‌స్టర్ ప్రఖ్యాతి గాంచిన బోస్టన్‌లో ఎర్త్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా కొనసాగుతున్నారు. ఐలవరం విద్యార్థులకు ఆయన పరిశోధన చేస్తున్న రాళ్ల నమూనాలను చూపించారు. ఇంగ్లీష్ టీచర్ పచ్చారు హరికృష్ణ ప్రొఫెసర్ అపాయింట్‌మెంట్ నెల క్రితం తీసుకున్నారు. హెచ్ఎం కాటూరి లక్ష్మీన్నారాయణ పర్యవేక్షించారు.

ప్రొక్లెయినర్ దగ్ధం

భట్టిప్రోలు: రహదారి నిర్మాణ పనులు చేస్తున్న ప్రొక్లెయినర్ ఒక్కసారిగా మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన సూరేపల్లి వద్ద గురువారం చోటుచేసుకుంది. భట్టిప్రోలు పోలీసుల కథనం మేరకు.. 216/ఏ జాతీయ రహదారి పనుల్లో భాగంగా మండలంలోని సూరేపల్లి రైల్వే గేట్ వద్ద వంతెన నిర్మాణ పనులు చేస్తున్న ప్రొక్లెయిన్ నుంచి మంటలు చెలరేగాయి. పొగలు రావడంతో డ్రైవర్ ఒక్కసారిగా బయటకు దూకేశాడు. బీఎస్‌సీ పీసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజర్ మేకా కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వై. సురేష్ తెలిపారు.

సమన్వయంతో పని చేయాలి

గొరిగపూడి(భట్టిప్రోలు): సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పని చేసి జగనన్న కాలనీ లే-అవుట్లలో గృహ నిర్మాణ లబ్ధిదారులను ఇళ్లు కట్టుకునేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి, బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు కోరారు. గొరిగపూడి సచివాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. పరిస్థితిని సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శి ఎండీ జిక్రియ, వీఆర్వో పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ‘ఉపాధి’

- ముమ్మరంగా ఉపాధి హామీ పథకం పనులు
- వేమూరులో లక్ష్యానికి చేరువగా పని దినాలు



వేమూరులో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

వేమూరు: వలసల నిరోధానికి తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఫలితాలు సాధిస్తోంది. అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తూ.. లక్ష్య సాధన దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. డెల్టా ప్రాంతంలో పంట, డ్రైయినేజీ కాలువలు పూడిక తీయడం, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, గుర్రపు డెక్క తొలగింపు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం, ఉద్యాన పంటల సాగులో కూలీలు పనిచేస్తున్నారు. ఈ పనులు కారణంగా రైతులకు సాగు నీరు పుష్కలంగా అందించే అవకాశాలూ మెరుగయ్యాయి. తద్వారా వ్యవసాయ రంగానికి ఉపాధి పనులు అసరాగా నిలుస్తున్నాయి.

31వేల జాబ్ కార్డులు..

వేమూరు నియోజకవర్గంలో 31 వేల మంది జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. 72 వేల మంది కూలీలున్నారు. జాబ్ కార్డుపై నమోదైన ఒక కుటుంబానికి ఏడాదికి కనీసం 100 పని దినాలు కల్పించాలన్నదే ప్రభుత్వం లక్ష్యం. కుటుంబానికి ముగ్గురు కంటే ఎక్కువగా సభ్యులు ఉన్నా వారికి కనీసం వంద పని దినాలు కల్పిస్తున్నారు. ఒకరిద్దరు సభ్యులున్న కుటుంబాలే నియోజకవర్గంలో అధికంగా ఉన్నాయి. గ్రామాల్లో పని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి కల్పిస్తున్నారు.

8.90లక్షల పనిదినాలు..

ఈ ఆర్థిక సంవత్సరం వేమూరు నియోజకవర్గంలో 11.13 లక్షల పని దినాలు లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 8.90లక్షల పని దినాలు కల్పించారు. మార్చి నెలాఖరు లోపు లక్ష్యాన్ని పూర్తి చేయడం జరుగుతుందని ఆధికారులు తెలిపారు. మార్చి 31 నాటికి ప్రభుత్వం ఉపాధి కూలీలకు పని కల్పించిన లక్ష్యం పూర్తి చేయడం జరుగుతుందని అధికారులు చెప్పన్నారు.

2022-23 ఆర్థిక సంవత్సరానికి వేమూరు నియోజకవర్గంలో ఉపాధి కల్పన ఇలా...

మండలం	లక్ష్యం (పని దినాలు)	పూర్తయినవి
వేమూరు	1.90లక్షలు	1.50లక్షలు
కొల్లూరు	2.70లక్షలు	1.70లక్షలు
భట్టిప్రోలు	2.42లక్షలు	2 లక్షలు
అమర్తలూరు	2.31లక్షలు	1.70లక్షలు
చుండూరు	2.43లక్షలు	2 లక్షలు

లక్ష్యం పూర్తి చేస్తాం..

వేమూరు నియోజక వర్గంలో ఉపాధి లక్ష్యం మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తాం .ప్రతి కూలీకి పని కల్పిస్తున్నాం. బాపట్ల జిల్లా స్థాయిలో ఇచ్చిన లక్ష్యం కూడా పూరి చేయడం జరుగుతుంది.

– బాలమ్మ, ఉపాధి పథకం, అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి, బాపట్ల

ప్రతి కూలీకి పని..



గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు అడిగిన ప్రతి కూలీకి కల్పిచడం జరుగుతోంది. గతం కన్నా ఇప్పుడు కూలీల సంఖ్య పెరిగింది. ఉపాధి కూలీల పనులపై పర్యవేక్షణ చేయడం జరుగుతోంది.

– సజ్జా లక్ష్మీ తిరపతమ్మ, సర్పంచ్, వేమూరు

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా పాలన

ఎమ్మెల్యే కోన రఘుపతి



బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా రాష్ట్రంలో పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని సంజయ్‌గాంధీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గురువారం జరిగింది. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ నివేశన స్థలాలు మంజూరు చేయటంతో పాటు పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సాయం చేసిందన్నారు. నవరత్నాలను అమలు చేయటంతోపాటు ఎన్నికల మ్యానిఫెస్టోను 98శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని చెప్పారు. బాపట్ల నియోజకవర్గంలో ప్రాధాన్యత క్రమంలో పనులు చేసుకుంటూపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, విద్యుత్ ఏఈ పెరుగు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఆట్ల ప్రసాదరెడ్డి, గవిని ఇందిరా, నర్రావుల వెంకట్రావు, శాయిల మురళీ, నక్కా వీరారెడ్డి, పోలూరి వెంకన్న, ఆంజనేయప్రసాద్, జాలిరెడ్డి, బొట్టు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

21న బార్ అసోసియేషన్ ఎన్నికలు

- 15 నామినేషన్‌లు దాఖలు
- అధ్యక్ష, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ స్థానాలకు తప్పని ఎన్నిక
- ఎలక్షన్ ఆఫీసర్ ప్రశాంత్ కుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఎలక్షన్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్

రేపల్లె రూరల్: బార్ అసోసియేషన్ ఎన్నికలకు 15 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎలక్షన్ ఆఫీసర్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. నామినేషన్ ప్రక్రియ రెండవ రోజు గురువారం పూర్తయిన సందర్భంగా స్థానిక అసోసియేషన్ హాలులో ఆయన మాట్లాడారు. అధ్యక్ష, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ స్థానాలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర స్థానాలు ఒక నామినేషన్ మాత్రమే దాఖలు కావటంతో ఏకగ్రీవమైనట్లు పేర్కొన్నారు. అధ్యక్ష స్థానానికి కేసన వెంకట గోపాలరావు, కొండపల్లి శ్రీనివాసరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీకి డీఎస్ హరికుమార్, సైకం రవి వర్మ నామినేషన్‌లు దాఖలయ్యాయని చెప్పారు. వైస్ ప్రెసిడెంట్‌కు ఎంవీ సుబ్బారావు, జనరల్ సెక్రటరీకి ఎస్.పోతురాజు, జాయింట్ సెక్రటరీకి కేజీఎల్ శ్రీనివాసరావు, లైబ్రేరియన్‌గా మోర్ల కృష్ణరావు, ట్రెజరర్‌గా టీఎస్ దీనరాజ్, లేడీ రిప్రజంటేటివ్‌గా కె.శ్రీవాణి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పీజే ప్రకాష్, యెండూరి రాజేష్, ఎస్‌డీఎం రబ్బానీ, యార్లగడ్డ ధర్మతేజ, గుమ్మడి కుమార్‌బాబు మాత్రమే నామినేషన్‌లు దాఖలు చేయటంతో ఆయా స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. 21న అధ్యక్ష, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ స్థానాలకు నిర్వహించే ఎన్నికలలో న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకుని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు.

ఆదర్శనీయం పొట్టి శ్రీరాములు త్యాగం..



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ యారం వనజ, ఎంపీడీఓ ఎలీషాబాబు నివాళి



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ ఎస్.రత్నకుమారి

కర్లపాలెం: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శనీయులని ఎంపీపీ యారం వనజ, పొట్టి శ్రీరాములు స్మారక సేవా సంఘం అధ్యక్షుడు బొలిశెట్టి రాంబాబు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాముల జయంతిని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీడీఓ ఎలీషాబాబు, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కేశవనారాయణరావు, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ఎం.శివయ్య నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కర్లపాలెం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ నక్కా లలితకుమారి పొట్టి శ్రీరాముల విగ్రహానికి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు టీవీ సుబ్బారావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు లక్ష్మణకుమార్, వాసవి క్వీన్స్ క్లబ్ అధ్యక్షుడు వై.నాగశ్వేత, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువరానిది

నిజాంపట్నం: అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగం మరువరానిదని అడవులదీవి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నందిపాటి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని అడవులదీవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు అద్దేపల్లి లక్ష్మీనరసింహరావు, వంకాయల గిరిధర్, శ్రీను, అద్దేపల్లి కోటేశ్వరరావు, సురేంద్రకుమార్, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు పొట్టి శ్రీరాములు

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆవరణలోని పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. క్లబ్ నిర్వాహకులు నంబూరు నాగభూషణరావు, నంబూరు తేజ, గోలి చంద్రయ్య, అధ్యక్షుడు నాగళ్ల ఆంజనేయులు, కోశాధికారి నంబూరు ప్రసాద్, ఎస్. ప్రసాద్, కె.పవన్, డి. ప్రసాద్, కె.మాధవ, ఎన్.నవీన్, జి.రమేష్, ఎస్.మణికంఠ పాల్గొన్నారు. వాసవి, వనిత క్లబ్స్ ఆధ్వర్యంలో రథం సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేశారు. ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, తూనుగుంట్ల సాయిబాబా, తమ్మన రమేష్‌బాబు, జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ మాటూరి మల్లేశ్వరరావు, క్లబ్ నిర్వాహకులు బూర్లె సుబ్బారావు, శనగపల్లి శ్రీనివాస ప్రసాదగుప్తా, బొలిశెట్టి శ్రీనివాసరావు, మద్దుల మహా వెంకటేశ్వరరావు, కె.రవికుమార్, బి.కిరణ్‌కుమార్, సీహెచ్ పాపారావు, తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైస్ చైర్మన్లు

పొట్టిశ్రీరాములు కృషి ఎనలేనిది

రేపల్లె: ఆంధ్రరాష్ట్ర సాధనలో పొట్టి శ్రీరాములు కృషి ఎనలేనిదని మున్సిపల్ వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ సారథి, కౌన్సిలర్ బొలిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కట్టా సుబ్బారావు తదితరతులు పాల్గొన్నారు. వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరాములు విగ్రహానికి నూలుమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నంబూరు సత్యప్రసాద్, బొలిశెట్టి కిషోర్, తటవర్తి విజయ్ కుమార్, రాజా, రాజేష్, రామకోటేశ్వరరావు, ప్రసాద్, ప్రసాదు,రాముడు పాల్గొన్నారు.

వేమూరులో..

వేమూరు: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములుని మాజీ ఎంపీపీ బొల్లిశెట్టి ప్రభాకరావు అన్నారు. వేమూరు బస్టాండ్ సెంటరులో ఆయన విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. దుంప గణేష్, కోమ్మూరి రమణ, కొల్లిపాకుల శంకర్, నంబూరు మల్లి, అత్తోట శ్రీనివాసరరావు, మలిపాటి వేణుమాధవ, నంబూరు శంకర్, పొట్టి వాసు పాల్గొన్నారు.

అమరజీవి పోరాట పటిమను..

బాపట్ల అర్బన్ : తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచమంతా చాటిన తొలి వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని వ్యవసాయ కళాశాల అసోసియేట్ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ ఎస్.రత్నకుమారి పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ కళాశాలలో పొట్టి శ్రీరాములు జయంతి సభ నిర్వహించారు. సభలో డాక్టర్ ఎస్.రత్నకుమారి పాల్గొని మాట్లాడారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

342 మంది విద్యార్థుల హాజరు..



పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిఘా నీడలో ప్రారంభమైయ్యాయి. పరీక్షలకు 363 మంది విద్యార్థులకు గాను 21 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ ఎస్.కె. జుభేర్ తెలిపారు. పిట్టలవానిపాలెం, కర్లపాలెం, చందోలు, ఖాజీపాలెం కళాశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద మహిళా పోలీసులు, చందోలు స్టేషన్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పాఠశాల తనిఖీ

చదలవాడ(వేమూరు): జగనన్న గోరుముద్ద పథకం అమలులో నిర్లక్ష్య వహిస్తే చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి పద్మజా రెడ్డి హెచ్చరించారు. చదలవాడలో గురువారం గ్రామ సచివాలయం, ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ కేంద్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 21 నుంచి విద్యార్థులకు రాగి జావ అందించడం జరుగుతుందని చెప్పారు. గ్రామ సచివాలయం సిబ్బంది ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని ఆదేశించారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం త్వరగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ షాది కాళీ, కేవీ సుబ్బారావు, భాగ్య లక్ష్మి, కోటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై వృద్ధుడి అత్యాచారం

భట్టిప్రోలు: బాలికపై వృద్ధుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన 65 ఏళ్ల వృద్ధుడు 11 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి సమీపంలోని మొక్కజొన్న పంట పొలాల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక ఏడుస్తుండటంతో తల్లి గమనించి విషయం అడగగా జరిగిన సంగతి చెప్పింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వై.సురేష్ తెలిపారు. బాలికను వైద్య పరీక్షలు నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

‘సంపద’ కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం



శిక్షణ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీపీఓ శంకర్ నాయక్

జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి వై.శంకర్ నాయక్



స్వచ్ఛ సంకల్పం శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శరత్‌బాబు

చెరుకుపల్లి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావటం ద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుకోవటానికి అవకాశం కలుగుతుందని బాపట్ల డ్వామా పీడీ, ఇన్‌చార్జి పంచాయతీ అధికారి వై.శంకర్ నాయక్ పేర్కొన్నారు. చెరుకుపల్లిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద గురువారం నుంచి శనివారం వరకు జరిగే శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. డివిజన్ స్థాయిలో మొదటి రోజు భట్టిప్రోలు, కొల్లూరు, అమర్తలూరు మండలాల్లో రెండు గ్రామ పంచాయతీల లెక్కన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంపద కేంద్రాల్లో తయారు చేసే వానపాముల ఎరువుతో పంచాయతీలకు ఆదాయం తేవడంతో పాటు.. ఆరోగ్యవంతమైన పంటలు పండించవచ్చన్నారు. కావున ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి వాటిని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లురు ఎంపీడీఓ ఐ.సత్యన్నారయణ, స్థానిక ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ డి.వాణి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పం విజయవంతం చేయాలి

కర్లపాలెం: స్వచ్ఛమైన గ్రామాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉందని బాపట్ల ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ శరత్ బాబు పేర్కొన్నారు. బాపట్ల డివిజన్ పరిధిలోని క్లాప్ మిత్రలకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు జగనన్న స్వచ్ఛ సంకల్పంపై దమ్మనవారిపాలెం గ్రామంలో జరుగుతున్న రెండవ విడత శిక్షణ శిబిరానికి డీఎల్‌పీవో శరత్‌బాబు గురువారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం నిర్వహణలో జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న దమ్మనవారిపాలెం గ్రామాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. స్వచ్ఛ సంకల్పంపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అవగాహన ఉన్నప్పుడే ప్రజలను చైతన్యవంతులను చేయగలుగుతారని చెప్పారు. తడిచెత్త, పొడిచెత్త వేరువేరుగా ప్లాస్టిక్ డబ్బాలలో వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.ఎలీషాబాబు, బాపట్ల ఎంపీడీఓ రాధాకృష్ణ, శిక్షణ కో-ఆర్డినేటర్ రామోహన్‌రావు, సర్పంచ్‌లు గురపసాల వెంకటేశ్వరమ్మ, పులుగు గోవిందమ్మ, నాదెండ్ల భానుప్రసాద్, కె.అనూష, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, వార్డు మెంబర్లు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

తాటిచెట్టు నుంచి జారిపడి.. గీత కార్మికుడి మృతి



బాపట్లటౌన్: తాటిచెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. పిన్నిబోయినవారిపాలెం గ్రామానికి చెందిన ఉప్పాల సాంబశివరావు (50) ముత్తాయపాలెంలో కల్లు కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టు నుంచి జారిపడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు అతనిని తరలించారు. చికిత్స పొందుతూ సాంబశివరావు మృతిచెందాడు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదుచేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

బడ్జెట్‌లో బీసీలకు పెద్ద పీట



వేమూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2023–2024 బడ్జెట్‌లో బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పించిందని ఏఎంసీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు గురువారం పేర్కొన్నారు. బీసీల సంక్షేమానికి రూ.23,509 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. గత ప్రభుత్వం తూతూ మంత్రంగా నిధులు కేటాయించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బీసీలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం కల్పించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన అభినందనలు తెలిపారు.

గృహాలు నిర్మించుకోవాలి

డీఆర్డీఏ పీడీ బొంతా అర్జునరావు



సమీక్షిస్తున్న డీఆర్డీఏ పీడీ అర్జునరావు, ప్రత్యేకాధికారి

భట్టిప్రోలు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు రావాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బొంతా అర్జునరావు పేర్కొన్నారు. గురువారం ఆయన భట్టిప్రోలులోని జగనన్న కాలనీని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం. హనుమంతరావుతో కలసి సందర్శించారు. ఇళ్ల నిర్మాణంపై సమీక్షించారు. పునాదులు, బేస్‌మెంట్లు వేయని వారిని చైతన్యపరచాలని, స్వయం సహాయక సంఘాల్లో ఉన్నవారికి రూ. 35 వేలు రుణం ఇప్పించాలని సూచించారు. ప్రస్తుతం లే-అవుట్‌లో విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా తాగునీరు, అంతర్గత రోడ్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎస్‌హెచ్‌జీ, హౌసింగ్ సీసీఎల్ రుణాలు ఎక్కువ మొత్తంలో ఇప్పించి వచ్చే శనివారం లోపు ప్రగతి చూపాలని ఏపీఎం, సీసీలు, వీఓఏలకు దిశానిర్దేశం చేశారు. ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు ఏడుకొండలు, శివకృష్ణ, రావూరి సౌమ్య, ఏపీఎం కొండూరి శోభన్, ఏరియా కో-ఆర్డినేటర్ రమాదేవి, ప్రత్యేక అధికారి ఆర్. చిన్నయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, సీసీలు హనోకు, రజనీ కుమారి, సాంబయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రా స్వరాజ్యలక్ష్మి, వీఓఏలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మజుందార్, పక్కన నాయకులు

బాపట్ల అర్బన్ : మోదీ ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5 ఢిల్లీలో కార్మిక, కర్షకుల పోరాట ప్రదర్శన జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మజుందార్ పిలుపునిచ్చారు. సీఐటీయూ బాపట్ల జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజా సమస్యలను మరింత జఠిలం చేస్తోందన్నారు. అదాని, అంబానీ బడా పారిశ్రామిక వేత్తలకు కేంద్రం కొమ్ముకాస్తోందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రశ్నించిన వారిని జైలుకు పంపిస్తోందని విమర్శించారు. కార్మికుల కనీస వేతనం రూ.26వేలు, కనీస పెన్షన్ రూ. 10వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వసంతరావు పాల్గొన్నారు.